క్లుప్తంగా

నేడు స్వామిదాసు ప్రచారం

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు శనివారం గంపలగూడెం మండలంలోని నాలుగు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి కనుమూరు, 9 గంటల నుంచి అనుముల్లంక, మధ్యాహ్నం మూడు గంటల నుంచి కొత్తపల్లి, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వినగడప గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వివరించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

చాట్రాయి: మండలంలోని చిత్తపూరు గ్రామంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల నామినేషన్

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)తో కలిసి ఉదయం 10గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి మైలవరం చేరుకుని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయండి



నూజివీడు: పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ఐదేళ్లు కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ తనయుడు వేణుగోపాల అప్పారావు (చంటినాయన) ప్రజలను కోరారు. నూజివీడు 31వ వార్డులో శుక్రవారం రాత్రి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వల్లే సాధ్యమవుతుందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ మేకల రమాదేవి, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, నాయకులు మేకల అనిల్ కుమార్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ముసునూరు: మద్యం, నగదు అక్రమ తరలింపును అడ్డుకునేందుకు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ పి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, సూరేపల్లి కూడలి కేంద్రాల్లో వాహనాలను తనిఖీ చేశారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లో నిఘా, సోదాలు మరింతగా పెంచామని ఆయన చెప్పారు. ముసునూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

తిరువూరు: దోమకాటుకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మా బేగం అన్నారు. శుక్రవారం 15వ వార్డులోని జన్మభూమి రోడ్డులో దోమల నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖ, నగర పంచాయతీ ఆధ్వర్యంలో మురుగుకాలువల్లో చెత్తాచెదారం తొలగించి దోమలకు ఆవాసంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేశారు. దోమ లార్వా ఎదగకుండా ఆయిల్ బాల్స్ ఉపయోగపడతాయని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రవి, ఆశాబీ, ఆరోగ్య కార్యదర్శి రమాదేవి, శానిటరీ కార్యదర్శి రవిదత్త నాయక్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

మైలవరం: మైలవరం ఒకటవ గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శ్రీనివాస్‌కు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో దుర్గా కల్యాణి, సలోమి, నాగ శేషురాణి, బి. అరుణ, ఎస్.సుజాత, ఎస్. లీలావతి, బి. గీతారాజేశ్వరి, షేక్ మదర్‌బీ, షేక్ బాజీ, సీహెచ్ కొండలరావు ఉన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

ఎంపీ కేశినేని నాని



దాములూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, తిరుపతిరావు

దాములూరు(ఇబ్రహీంపట్నం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరువైందని ఎంపీ కేశినేని నాని అన్నారు. మండలంలోని దాములూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీ నాని మాట్లాడుతూ సామాన్యుడికి, పెత్తందారుడికి మధ్య జరుగుతున్న యుద్ధంలో సామాన్యుడైన తిరుపతిరావును అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీగా పోటీ చేస్తున్న తనకు కూడా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విజయం చేకూర్చాలని కోరారు. తిరుపతిరావు మాట్లాడుతూ నవరత్న పథకాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామంలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, మండల పార్టీ కన్వీనర్ బొంత సాంబశివరావు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, గ్రామ కన్వీనర్ జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, గుంజా శ్రీనివాస్, పోరంకి శ్రీనివాసరాజు, ఎంఏబేగ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక..

కొండపల్లిలో టీడీపీకి చెందిన పలువురు మాజీ వార్డు సభ్యులతో పాటు మరో 125 కుటుంబాల సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎంపీ కేశినేని నాని, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ బీసీ సంక్షేమ సంఘం కొండపల్లి అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు బాలచందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని చెప్పారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దాం

విజయవాడస్పోర్ట్స్: సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని నాని పిలుపునిచ్చారు. తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం చింతలనర్వ గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడు గద్దల రవిచంద్ర, ఎస్సీ సెల్ టీడీపీ జిల్లా నాయకుడు గద్దల వెంకటేశ్వరరావు, చింతలనర్వ గ్రామ టీడీపీ నాయకులు బొల్లెపోగు పెద్ద గోపయ్య, గద్దల రవి, కొంగల ఏసుదాసు, బొల్లెపోగు ఏసుబాబు వైఎస్సార్ సీపీలో చేరారు. చింతలనర్వ వైఎస్సార్ సీపీ నాయకులు యనమద్ది నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వీరందరికీ ఎంపీ కేశినేని నాని విజయవాడలోని కేశినేని భవన్‌లో వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎంపీ కేశినేని నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన తిరువూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు : వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ కేశినేని నాని, తిరుపతిరావు

అందరికీ పథకాల అమలు వైఎస్సార్ సీపీకే సాధ్యం

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు



కోకిలంపాడులో ప్రచారం చేస్తున్న స్వామిదాసు

తిరువూరు: రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను ప్రజలకందించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మండలంలోని కోకిలంపాడు, లక్ష్మీపురం, మల్లేల గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు స్వామిదాసుకు ఘనస్వాగతం పలికారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు పేదల ఇబ్బందులు గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. తెలుగుదేశం పార్టీ చెబుతున్న సూపర్ సిక్స్ పథకాల్లో కొత్తదనమేమీ లేదని, వైఎస్సార్ సీపీ అమలు చేసిన పథకాలనే మసిపూసి మారేడు కాయ చేసి చెబుతున్నారని విమర్శించారు. వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే పింఛను తెచ్చి అందించే వలంటీర్లను విధులకు దూరంగా ఉంచడం, చిత్తశుద్ధితో విధులు నిర్వహించే అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం టీడీపీకి పరిపాటిగా మారిందని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, మల్లేల పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవికుమార్, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి, నాయకులు కోటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల చైర్మన్ సుధాకరరావును కలిసిన సర్నాల



మైలవరంలో జమిందారు ఎస్వీ సుధాకరరావును కలిసిన తిరుపతిరావు

మైలవరం: ద్వారకా తిరుమల చైర్మన్, మైలవరం జమిందారు ఎస్వీ సుధాకరరావును వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నట్లు ఆయనకు తెలియజేశారు. దీనిపై స్పందించిన మైలవరం జమిందారు సుధాకరరావు ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావుకు తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని ఆశీస్సులు అందజేశారు. అనంతరం తిరుపతిరావు మైలవరంలోని గ్రామ పెద్దలు కఠారి ఉమామహేశ్వరరావును కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ప్రముఖ బీసీ నాయకులు పామర్తి శ్రీనివాసరావును కలిసి ఆశీస్సులు కోరి, నామినేషన్ వేస్తున్నట్లు తనకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సర్నాల తిరుపతిరావు వెంట స్థానిక ప్రజాప్రతినిదులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జామియా మసీదులో ప్రార్థనలు..



ప్రార్థనల అనంతరం ముస్లిం పెద్దలను ఆలింగనం చేసుకుంటున్న తిరుపతిరావు

మైలవరం: మైలవరం జామియా మసీదు (పెద్ద మసీదు)లో వైఎస్సార్ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ శనివారం నామినేషన్ వేసే సందర్భంగా మసీదులో ప్రార్థనలు నిర్వహించామని, ముస్లింలు వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాల్సిందిగా కోరారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

వాహనమిత్రతో భరోసా

- ఐదేళ్లలో రూ. 9.69 కోట్లు జమ
- నియోజకవర్గంలో 9,690 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తంచేస్తున్న ట్యాక్సీ, ఆటోవాలాలు
- మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని మనసారా దీవెనలు



నూజివీడు బస్టాండు వద్ద ఆటోలు

నూజివీడు: ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న పేదవర్గాలకు చెందిన వారి సంక్షేమం గురించి గతంలో ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదు. వారి సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదు. వీరి కష్టాలను తన పాదయాత్రలో స్వయంగా చూసి చలించిపోయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రిగా వాహనమిత్ర పథకాన్ని అమలు చేశారు. ఈ ఐదేళ్లలో ఏటా రూ.10 వేల చొప్పున అర్హులందరి ఖాతాల్లో జమ చేశారు. ప్రభుత్వం అందజేసిన సాయం వల్ల అప్పులు చేయాల్సిన పరిస్థితి తమకు తప్పిందని ఆటోలు, ట్యాక్సీ వాలాలు ఆనందం చేస్తున్నారు. పేదల సంక్షేమం గురించి ఆలోచించే మనసున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మనసారా దీవిస్తున్నారు.

నియోజకవర్గంలో 9,690 మందికి లబ్ధి

2019 అక్టోబర్ నెలలో వాహనమిత్ర పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆటోలు, ట్యాక్సీలు, ట్యాక్సీ క్యాబ్‌లు ఉన్న వారిని ఎంపిక చేసి, ఏడాదికి ఒకసారి రూ.10 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఇప్పటి వరకు ఐదు విడతలుగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేసింది. దీంతో ఆటోలు, ట్యాక్సీలు నడిపే వారికి ఇన్సూరెన్స్, రిపేర్లు, సర్వీసింగ్, బ్రేక్, నెలవారీ కిస్తీలు, వీటికి తోడు మూడు నెలలకొకసారి ట్యాక్స్‌లు చెల్లించటం వంటి అనేక ఖర్చుల నుంచి కాస్త ఉపశమనం లభించింది. ఐదేళ్లలో వాహనమిత్ర కింద నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, టౌన్‌తో కలిపి 9,690 మందికి రూ.9.69 కోట్లు ట్యాక్సీ డ్రైవర్లు, ట్యాక్సీ క్యాబ్‌లు, ఆటోవాలాల వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం నేరుగా జమ చేసింది.

రూ.50 వేల లబ్ధి



వాహనమిత్ర పథకం ద్వారా ప్రభుత్వం ఐదు విడతల్లో నా బ్యాంకు ఖాతాకు రూ.50 వేలు జమ చేసింది. ఇవి ఆటోకు ఇన్సూరెన్స్ కట్టడంతో పాటు ఆటో నిర్వహణ ఖర్చులకు బాగా ఉపయోగపడ్డాయి. ఆటోల వారిపై భారం లేకుండా ప్రభుత్వం ఆదుకుంది. అలాగే మా కుటుంబానికి అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా పథకాల కింద కూడా లబ్ధి చేకూరింది. థ్యాంక్యూ సీఎం సార్.

– మేదూరి మల్లేశ్వరరావు, బాపూనగర్, నూజివీడు

ఆటో నిర్వహణకు ఉపయోగపడ్డాయి



వాహనమిత్ర పథకం ద్వారా ప్రభుత్వం నా బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ చేసింది. వీటితో కుటుంబ అవసరాలను తీర్చుకోవడమే కాకుండా ఆటో టైర్లు కొనుక్కొనేందుకు, ఇతర నిర్వహణకు ఉపయోగపడ్డాయి. అలాగే వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి పథకాలు రావడంతో పాటు మానాన్నకి పింఛన్ సైతం వస్తోంది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు

– ప్రత్తిపాటి బాబు, నెహ్రూపేట, నూజివీడు

ఆటో కిస్తీలు చెల్లించా



ప్రభుత్వం వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల చొప్పున ఐదుసార్లు రూ.50 వేలు నా బ్యాంకు ఖాతాలో వేసింది. ఇవి ఆటో కిస్తీలు చెల్లించేందుకు బాగా ఉపయోగపడ్డాయి. అంతేగాకుండా మా కుటుంబానికి అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా పథకాలు రావడంతో పాటు ఇంటి స్థలం కూడా వచ్చింది. గతంలో ఏ ప్రభుత్వం ఇంతలా పేదలను ఆదుకోలేదు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– తాడేపల్లి శ్యాంకిషోర్, బోర్వంచ, నూజివీడు మండలం

మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నూజివీడు: మానవ తప్పిదాల వల్లే ఎక్కువశాతం అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ కేవీ విశ్వనాథ్ అన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్నిప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం పట్టణంలోని గిఫర్డ్ మెమోరియల్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నివారణపైన, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని, మంటలు ఆర్పేందుకు అవసరమైన నీరు, కార్బన్‌డై ఆక్సైడ్ సిలిండర్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. దీంతో ప్రమాద తీవ్రత పెరగకుండా ఉంటుందని చెప్పారు. వివిధ రకాల ప్రదేశాల్లో సంభవించే అగ్నిప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలను వైద్య సిబ్బందికి, ప్రజలకు పంపిణీ చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎదుర్కొనే విధానంపై డెమో ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

విస్సన్నపేట: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి. నానికా అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో ద్వారా వివరించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నామినేషన్ల స్వీకరణ

మైలవరం: మైలవరం నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్ తెలిపారు.

రెడ్డిగూడెంకు చెందిన వేముల పృథ్వీ, ఇబ్రహీంపట్నం టెంపుల్ స్ట్రీట్‌కు చెందిన వేల్పూరి కనకదుర్గాదేవి మైలవరం ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా తమ నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు.

రెండో రోజు నామినేషన్లు నిల్

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం రెండో రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేయగా, తొలి రోజు గురువారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు నామినేషన్ వేశారు. శని, సోమవారాల్లో మరికొందరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

వైఎస్సార్ సీపీకి మరో అవకాశం ఇవ్వండి



రాయగూడెంలో ప్రచారం చేస్తున్న సుధారాణి

గంపలగూడెం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా కొనసాగాలంటే ఓటర్లు మరోసారి వైఎస్సార్ సీపీకి అధికారం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సతీమణి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆమె గంపలగూడెం పడమట దళితవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆమె ఓట్లను అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో సుధారాణి ఎన్నికల ప్రచారం

తిరువూరు: మండలంలోని లక్ష్మీపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుకు మద్దతుగా ఆయన సతీమణి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుధారాణి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ శివారులోని రాయగూడెంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సుధారాణి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు మళ్లీ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసరావు, వెంకటరమణ, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో శిక్షణ

ఆగిరిపల్లి: అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం, స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని అంధులు అందరిలా సమాన అవకాశాలు పొందడానికి కృషి చేయాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి కోరే సురేష్ అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ సంస్థలోని అంధుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా, స్పర్శతో వస్తువులను గుర్తించడం, చిత్రలేఖనం, శ్వాసపై ధ్యాస, భయం, నిరాశను తొలగించడం వంటి పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆర్ట్ ఆఫ్ లింగ్ సంస్థ సభ్యులు ప్రమోద్ భరద్వాజ్, సాయికిరణ్, హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ సాయిబాబు, సుఖవాసి రుష్యంత్ పాల్గొన్నారు.

'కల్యాణమస్తు' గోల్డ్ కాయిన్లు అందజేత



విస్సన్నపేట: పాడి రైతులు చంద్రుపట్ల గ్రామానికి చెందిన మల్లవల్లి లక్ష్మీ కుమారుడు అప్పారావు వివాహం సందర్భంగా కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేల విలువ గల గోల్డ్ కాయిన్‌ను శుక్రవారం అందజేశారు. అదే గ్రామానికి చెందిన మల్లవల్లి వెంకట మహేశ్వరి కుమార్తె అనూష వివాహం సందర్భంగా రూ.20 వేలు విలువ గల గోల్డ్ కాయిన్‌ను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ టి. సాంబశివమూర్తి, సంఘం అధ్యక్షురాలు చిల్లపల్లి భాగ్యమ్మ పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ గణనపై అవగాహన



నూజివీడు: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు విషయంలో నిబంధనలకు లోబడి పరిశీలించాలని ఏలూరు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు కీర్తి నారాయణన్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ఎన్నికల వ్యయ పరిశీలకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థులు రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని, అంతకంటే ఎక్కువ ఖర్చుచేస్తే అనర్హులని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, ఫ్లెక్సీ, బ్యానర్లు, తదితర అంశాలపై వ్యయాలను లెక్కించే విధానాన్ని వివరించారు. అభ్యర్థులకు కూడా ఎన్నికల వ్యయంపై అవగాహన కల్పించాలన్నారు. రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై.భవానీశంకరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: అన్నవరం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఎమ్మార్ అప్పారావు కాలనీ, అన్నవరం, వెంకటాయపాలెం, హనుమంతులగూడెం, సిద్ధార్థ నగర్, వెంకటాద్రిపురం, కొత్తూరు తండా, లైన్‌తండా, హటియాతండా, ఓగిరాల తండాలలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం

చాట్రాయి: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండలంలోని చనుబండ కోదండ రామాలయంలో గురువారం రాత్రి సీతారాములవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివార్లను ఉంచి జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, నూజివీడు సీఐ కె.రామకృష్ణ, ఎస్ఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల పవళింపు సేవ

తిరువూరు: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ముగింపు కార్యక్రమాన్ని తిరువూరులోని పలు ఆలయాల్లో నిర్వహించారు. కోదండ రామాలయం, వేంకటాచల స్వామి ఆలయం, రాజుపేట ఆంజనేయస్వామి దేవస్థానాల్లో సీతారామచంద్రస్వామికి పవళింపు సేవ, తిరుమంజనం తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీరామ పట్టాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు.